


కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఫిబ్రవరి 07 2025 | సంపుటి :0 | సంచిక : 116 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# సీఎం రేవంత్ అధ్యక్షతన కొనసాగుతున్న సీఎల్పీ భేటీ




- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ భేటీ జరుగుతోంది.
- ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన అజెండా.
- 42% బీసీ రిజర్వేషన్లు ఎన్నికల్లో పాటించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది.
- కొంత మంది అసంతృప్త ఎమ్మెల్యేల సమావేశం వల్ల భేటీకి ప్రాధాన్యం

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం కొనసాగుతోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరుగుతున్న సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నట్లు సమాచారం. తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చ జరిగే అవకాశముంది. ఈ భేటీకి కొనసాగింపుగా రెండు మూడు జిల్లాల వారీగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు.
ఒకపక్క ఎస్సీ వర్గీకరణ అమలుకు సర్కారు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామంది. మరోపక్క తాము కోరిన పనులు కాలేదంటూ కొందరు పార్టీ ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశం ఏర్పాటు చేసుకొన్నారని వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

## హయత్‌నగర్‌లో విషాదం.. స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి



హయత్‌నగర్: రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం స్కూల్ బస్సు కింద పడి నాలుగేళ్ల చిన్నారి (ఎల్‌కేజీ విద్యార్థిని) ప్రాణాలు కోల్పోయింది. బాలిక స్కూల్ బస్సు దిగి వెళ్తుండగా డ్రైవర్ బస్సును రివర్స్ చేశాడు. బాలిక రోడ్డు దాటుతున్న విషయాన్ని గమనించకుండా బస్సును రివర్స్ చేయడంతో వెనక టైర్ల కింద పడి చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2 లో

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన కేటీఆర్.. జాతీయ రహదారిని విస్తరించాలని రిక్వెస్ట్..!



కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు గురువారం కలిశారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కలిసి ఢిల్లీలో కలిసి జాతీయ రహదారి విస్తరణపై విజ్ఞప్తి చేశారు.

2 లో

## యూజీసీ నిబంధనలతో విద్యార్థులకు నష్టం : ఢిల్లీలో కేటీఆర్

- కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ బృందం కేంద్ర మంత్రులతో భేటీ
- యూజీసీ ముసాయిదా నిబంధనలపై అభ్యంతరాలు, విద్యార్థులపై ప్రభావంపై చర్చ
- వర్సిటీ వీసీల నియామక బాధ్యతను గవర్నర్‌కు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్
- 365B జాతీయ రహదారి సూర్యాపేట-సిరిసిల్ల విస్తరణకు నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి
- బీఆర్ఎస్ పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని డిమాండ్



కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట-సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది.

2 లో

## సుపారీ గ్యాంగ్‌తో హత్య.. మమత హత్య కేసులో వీడిన చిక్కుముడి

- కరీంనగర్ జిల్లాలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బెల్లంపల్లికి చెందిన మమతను జనవరి 27న హత్య చేసి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో పడేసిన విషయం తెలిసిందే.



2 లో

గంగాధర: కరీంనగర్ జిల్లాలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బెల్లంపల్లికి చెందిన మమతను జనవరి 27న హత్య చేసి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి శివారులో పడేసిన విషయం తెలిసిందే. వివాహేతర సంబంధమే మమత హత్యకు కారణమని పోలీసులు నిర్ధరించారు. ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం కాసిపేటకు చెందిన మమత.. జనవరి 27న తన కుమారుడితో కలిసి బెల్లంపల్లి నుంచి కారులో బయలుదేరింది.

## ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగసభలు నిర్వహిస్తాం



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు.

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఐదున్నర గంటల పాటు భేటీ.
- ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్, సంక్షేమ పథకాలు ప్రధాన చర్చ అంశాలు.
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నేతలకు సీఎం సూచనలు.
- ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు, నేతల కోసం ఢిల్లీ పర్యటన.
- పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై చర్చ, స్ట్రాటజీ ఫైనల్.

2 లో

## తెలంగాణ పీఈ సెట్.. ఎడ్ సెట్ షెడ్యూల్ విడుదల



హైదరాబాద్: తెలంగాణలో పీఈ సెట్, ఎడ్ సెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. మార్చి 12న పీఈ సెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. మార్చి 15 నుంచి మే 24 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో మే 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించినట్లు ఉన్నత విద్యా మండలి తెలిపింది.

2 లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఫిబ్రవరి 07 2025

# సంపాదకీయం

## కులాల సంగతులతోనే సర్వేకు సార్థకత!

షెడ్యూల్ కులాల (ఎస్సీలు) వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఒక ముందడుగు వేసింది. నిస్సందేహంగా స్వాగతించాల్సిన పరిణామం ఇది. 30 ఏళ్లుగా వివిధ రూపాల్లో తెలుగునాట అనేక ఆందోళనలకు కారణమై ఎన్నో చిక్కుముడులున్న సమస్య పరిష్కారానికి ఒకదారి ఏర్పడింది. ఏ జటిల సమస్యకైనా నూటికి నూరుపాళ్లూ అందరికీ ఆమోదకరమైన పరిష్కారం ఉండదు. మొత్తం ఎస్సీలను మూడు సమూహాలుగా చేసి 1, 9, 6 శాతం చొప్పున రిజర్వేషన్లను కేటాయించటంపై అసంతృప్తులూ అసమ్మతులూ ఇప్పటికే కొన్ని వినిపిస్తున్నాయి. ఇవి రానున్న రోజుల్లో ఏ రూపం తీసుకుంటాయో ఇప్పుడే చెప్పలేం. కాలక్రమేణా సద్దుమణగనూ వచ్చు. కొత్త వాదనలతో కొంత కాలం కొనసాగనూ వచ్చు!

ఏ సామాజిక సమస్యా నిరంతరం వాద ప్రతివాదాలతో, సంఘర్షణాత్మకంగా కొనసాగాలని ఎవ్వరమూ కోరుకోం. సమస్యలను సాధ్యమైనంతమేరకు తక్కువ అసమ్మతితో పరిష్కరిస్తూ ముందుకు వెళ్లాలనే అనుకుంటాం. వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని చెబుతూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు కొన్ని హెచ్చరికలనూ షరతులనూ పెట్టింది. కుల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించకూడదన్నది అందులో ప్రధానమైంది. రిజర్వేషన్లు వర్తింపచేసే అన్ని రంగాల్లో ఒక కులం బాగా వెనుకబడి ఉందని గణాంకాల ఆధారంగా నిర్ధారించుకుని ఆ వెనుకబాటుని అధిగమించటానికి ఎంత శాతం రిజర్వేషన్లు అవసరమో అంత శాతం మాత్రమే ఉండేలా చూడాలనీ స్పష్టంచేసింది. జనాకర్షణ రాజకీయాల కోసం రిజర్వేషన్ల శాతాలను నిర్ణయించకుండా ముందుగా కట్టడి చేసే ఉద్దేశంతో సుప్రీంకోర్టు దీన్ని నిర్దిష్టంగా పేర్కొంది. ఒకవేళ ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా దీనికి భిన్నంగా రిజర్వేషన్ల శాతాలను నిర్ణయిస్తే కోర్టుకు రావచ్చనీ స్పష్టంచేసింది. న్యాయ సమీక్ష ముందు రిజర్వేషన్ల శాతాలు నిగ్గుతేలాల్సి వస్తుందనీ హెచ్చరించింది.

ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడాల్లేకుండా జనాకర్షణ, ఓట్ల రాజకీయాల కోసం నిర్హేతుక నిర్ణయాలు తీసుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పెట్టిన షరతులూ చేసిన హెచ్చరికల్లో ఔచిత్యం లేదని అనుకోలేం. ఈ నేపథ్యంలో వర్గీకరణ సమస్యపై జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన నివేదిక మొత్తాన్ని ప్రజల ముందు పెట్టి ఉంటే సముచితంగా ఉండేది. నివేదికలో ప్రధాన అంశమైన రిజర్వేషన్ల శాతాన్ని ఆమోదించిన తర్వాత ఆలస్యం చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండకూడదు. రిజర్వేషన్ల శాతం నిర్ధారించటానికి ప్రాతిపదికగా ఉన్న సమస్త సమాచారాన్ని వెంటనే బయటపెట్టటం వలన అపోహలూ అపార్థాలూ తొలగిపోతాయి.

సరైన గణాంకాలు ఉండకపోవటం మన సమాజంలో పెద్ద సమస్య. ప్రజాధనాన్ని ఎంతో ఖర్చుపెట్టి సేకరించిన గణాంకాలను అ ప్రజలకే వెల్లడించని సంఘటనలు మనకు చాలా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేనే దీనికి నిదర్శనం. ఎంతో ఆర్భాటంగా, దేశంలోనే కనీవినీ ఎరగని రీతిలో సర్వేని చేపడుతున్నామని చెప్పి దాని గురించి అధికారికంగా ఒక్కమాటైనా మాట్లాడకుండా ఏళ్లపాటు మౌనం వహించటాన్ని ప్రజాస్వామిక నైతికత దృష్ట్యా ఏ మాత్రం సమర్థించలేం. ఎన్నో వైపుల నుంచి ఎందరో ఆ సర్వే ఫలితాలు వెల్లడించాలని కోరినా ఏళ్లపాటు కిమ్మనలేదు. వర్గీకరణపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా దాన్ని చక్కటి రంగులతో, గ్రాఫ్‌లతో కూడిన సంక్షిప్త నివేదికను అనధికారికంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. రాజకీయాల కోసం సర్వేలను సమయానుకూలంగా దాచిపెట్టటమూ వెల్లడిచేయటమూ చేస్తారనటానికి ఇంతకంటే నిదర్శనం ఉండదు.

విద్య, ఉద్యోగాలు, పదవుల్లో వివిధ కులాలకు దక్కిన ప్రాతినిధ్యంపై 1990ల నుంచి రాజకీయంగానూ ఇతరత్రానూ విపరీతంగా చర్చలు జరుగుతున్నాయి. వర్గీకరణ సమస్య కూడా ఆ చర్చల నుంచి ఊపిరిపోసుకుని ఆందోళనబాటను తీసుకుంది. వివిధ స్థాయి ఉద్యోగాల్లో మాల, మాదిగలతో పాటు ఇతర చిన్నకులాలకు దక్కిన ప్రాతినిధ్యం వెల్లడైతే మన సమాజంలో మార్పుల తీరుతెన్నులూ తెలుస్తాయి. వివిధ కులాలకు దక్కిన ఉద్యోగాల గురించి రాజకీయంగా చేసే వాదనలు, ప్రచారాలు స్థూలంగా నిజాలు కావచ్చు. కానీ స్థూల సమాచారం ఎప్పటికీ నిర్దిష్ట వివరాలకు సమానం కాదు. అందుకే ఉద్యోగాల్లోనూ, ప్రభుత్వం నుంచి సహాయం అందుకున్న పథకాల్లోనూ ఎవరు ఎక్కడున్నారో తెలియటం సామాజిక న్యాయం దృష్టితో చూస్తే చాలా అవసరం.

ఎస్సీల వర్గీకరణ సమస్య ఉమ్మడి రాష్ట్రంలో ఊపిరిపోసుకుంది. కులగణన సమస్య అలా కాదు. దేశవ్యాప్తంగా కులగణన అవసరంపై ఉధృతంగా ప్రచారం చేసి దాన్నొక రాజకీయ అజెండాగా పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ కులగణన గురించి మాట్లాడని రోజులేదు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిపోయిన ఉన్నతాధికార వర్గంలో గుప్పెడుమంది బీసీల తలరాత రాస్తున్నారనీ అనేక సందర్భాల్లో విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణనను చేపట్టి సామాజిక న్యాయానికి చరిత్రాత్మక రీతిలో స్వీకారం చుట్టి దేశగతినే మార్చివేస్తామనీ చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కులగణన విషయంలో ముందుండి మార్గదర్శకంగా నిలబడతాయని కూడా ప్రకటనలు చేశారు.

ఇందులో భాగంగానే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను పూర్తిచేసింది. కొంతమేరకు ఫలితాలను వెల్లడించింది. సమాచారం పాక్షికంగా వెల్లడించటంతో తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రాన్ని ఇప్పటికి పూర్తిగా తెలుసుకునే అవకాశం లేదు. ఒక్క కులాల వారీ జనాభాకే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయపరమైన వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెప్పారు. గోప్యత దృష్ట్యా వ్యక్తిగత వివరాలు వెల్లడించలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పటాన్ని ఒకకోణం నుంచి విమర్శించలేం! ఫలానా వ్యక్తికి ఇన్ని ఆస్తులు ఉన్నాయి.. ఇన్ని వాహనాలు ఉన్నాయి.. ఇన్ని భూములు ఉన్నాయి. ఇన్ని భవనాలు ఉన్నాయి.. అని పేరుతో సహా వెల్లడిస్తే సమస్య వస్తుంది. గోప్యతకు భంగం కలుగుతుంది. కులాల వారీ జనాభా ఇవ్వటానికీ ఏ కులం వారు ఉద్యోగాల్లో ఎంత మంది ఉన్నారో చెప్పటానికీ వివిధ స్థాయిల్లో రాజకీయ పదవుల్లో ఎందరున్నారో తెలపటానికి అభ్యంతరం ఏమిటో అర్థం కాదు. కనీసం బిహార్ ప్రభుత్వం 2023లో వెల్లడించిన కులగణన వివరాల స్థాయిలో ఇవ్వటానికి వెనుకాముందు ఆడితే కాంగ్రెస్ సామాజిక న్యాయ అజెండాకు సార్థకత ఉండదు.కాంగ్రెస్ పార్టీ తాను చేపట్టదలచిన సర్వే పేరులోనే ఏ విషయాలను సేకరిస్తామో స్పష్టంచేసింది. 'సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే' పేరిట ఇంటింటికి తిరిగి సేకరించిన సమాచారంలో రిజర్వేషన్, నాన్ రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన ప్రజల శాతాన్ని మాత్రమే ప్రకటించారు. దీని వల్ల సర్వే లక్ష్యంగా పేర్కొన్న ఆరు అంశాల్లో ఏదీ స్పష్టంగా తెలియదు. అవసరమైన పక్షంలో మాత్రమే వ్యక్తిగతమైన సమాచారం మినహా మిగతా సమాచారాన్ని వెల్లడిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. సర్వే సమాచారాన్ని క్రోడీకరించి మొత్తం ఆరు అంశాలకు సంబంధించిన వివరాలను నిర్దిష్టంగా ఫలానా తేదీ లోపల వెల్లడిస్తామని స్పష్టం చేయలేదు. మంత్రులు కూడా ప్రభుత్వ పథకాల అమలులో సర్వే సమాచారాన్ని ఉపయోగించుకుంటామని మాత్రమే చెబుతున్నారు.

తెలంగాణ సమాజమే కాదు.. దక్షిణాది రాష్ట్రాలన్నీ 1990ల నుంచి వేగంగా అనేక సామాజిక మార్పులకు లోనవుతున్నాయి. బీసీలు రాజకీయ చైతన్యపరంగానే కాదు.. విద్యా, ఉద్యోగ విషయాల్లో పోటీపడటంలో వెనుకంజ వేయటం లేదు. తమకు కేటాయించిన రిజర్వేషన్లకు మించి ఓపెన్ కేటగిరీలో ప్రతిభను ప్రదర్శించి విద్యారంగంలోనూ, ఉద్యోగాల్లోనూ స్థానాలను సంపాదించుకుంటున్నారు. గడిచిన నాలుగైదు సంవత్సరాల్లో వైద్య సీట్లను చూసినా ఇది అర్థం అవుతుంది. ఇటీవల గ్రూప్%–%1 మెయిన్‌కు అర్హులైన వారి జాబితా చూసినా ఇది తెలుస్తుంది. ఉద్యోగాల విషయంలోనూ ఈ సామాజిక మార్పు కనపడుతుంది. పంచాయతీ సంస్థల్లోనూ రిజర్వేషన్లకు మించి కొన్నిచోట్ల రెట్టింపుగా పదవులను దక్కించుకుంటున్నారు. పోటీపడి ఉద్యోగాలను దక్కించుకోవటం ఆహ్వానించే పరిణామమైనా దానికి సంబంధించి కూడా పరిశీలించాల్సిన అంశాలు ఉన్నాయి. బీసీలకు సంబంధించి కూడా మూడునాలుగు కులాలు మాత్రమే ముందున్నాయా అన్నది తెలుసుకోవటం కూడా కీలకం. బిహార్ సర్వే వల్ల వెల్లడైన నిజం అదే. ఓబీసీల్లోని నాలుగు కులాలే ఉద్యోగాలు, పదవుల్లో సింహభాగాన్ని అక్కడ దక్కించుకున్నాయి. సంఖ్యరీత్యా ఎక్కువున్న ఈబీసీలకు (ఎక్స్ట్రీమ్ బాక్వర్డ్ క్లాస్) అతి తక్కువ స్థాయిలో ప్రాతినిధ్యం ఉంది.

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసిన కేటీఆర్.. జాతీయ రహదారిని విస్తరించాలని రిక్వెస్ట్..!

మొదటి పేజీ తరువాయి

నేషనల్ హైవే 368బీ సూర్యాపేట నుంచి సిరిసిల్ల వరకు ఉన్న ప్రపోజల్‌ను వేములవాడ నుంచి కోరుట్ల వరకు విస్తరించాలని గడ్కరీని కేటీఆర్ కోరారు. దాంతో రహదారి వెంట ఉన్న తెలంగాణలోని ప్రముఖ ఆలయాలైన వేములవాడ రాజేశ్వరస్వామి దేవస్థానం, కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం, ధర్మపురం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాలు మరింత అనుసంధానమవుతాయని తెలిపారు.

అలాగే, నేషనల్ హైవే 63కి అనుసంధానం కలుగుతుందన్నారు. గతంలోనే మాజీ సీఎం కేసీఆర్ ఈ ప్రతిపాదనలు చేశారన్నారు. మానేరు నదిపై రోడ్డు-కమ్-రైలు వంతెనను నిర్మించాలని కేటీఆర్ బృందం విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర మంత్రికి తెలియజేసిన బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ వినోద్ కుమార్, రాజ్యసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సురేష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థులకు రూ.15 కోట్ల ఆఫర్.. 'ఆప్' ఆరోపణలు



ఆమ్‌ఆద్మీ పార్టీని చీల్చేందుకు భాజపా ప్రయత్నాలు చేస్తోందని ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. ఇందుకోసం ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థికి రూ. 15కోట్లు చొప్పున ఆఫర్ చేశారని.. ఇప్పటివరకు ఏడుగురిని సంప్రదించారని అన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన కొన్ని గంటలకే ఆప్ నేత ఈ ఆరోపణలు చేయడం గమనార్హం.

"మిగతా రాష్ట్రాల్లో మాదిరిగానే.. ఓట్ల లెక్కింపునకు ముందే భాజపా ఓటమిని అంగీకరించింది. దిల్లీలోనూ పార్టీలను విచ్ఛిన్నం చేసే రాజకీయాలను మొదలుపెట్టింది. ఏడుగురు ఎమ్మెల్యేలకు భాజపా శ్రేణుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆప్‌ను వీడి భాజపాలో చేరాలని.. ఇందుకు ఒక్కొక్కరికి రూ. 15కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారు" అని సంజయ్ సింగ్ ఆరోపించారు. అటువంటి ఫోన్ కాల్స్‌ను రికార్డు చేయాలని, ఒకవేళ నేరుగా భేటీ ఐతే సీక్రెట్ కెమెరాలతో వాటిని చిత్రీకరించాలని ఎమ్మెల్యేలకు సూచించామన్నారు.

డీపోర్టేషన్ ప్రక్రియ కొత్తదేమీ కాదు – జై శంకర్

భాజపా నేతల నుంచి తమ పార్టీ అభ్యర్థులకు ఫోన్‌కాల్స్ వచ్చాయని సంజయ్ సింగ్ చెప్పినప్పటికీ.. ఎవరు చేశారనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగగా.. 8వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఈసారి దిల్లీ పీఠాన్ని భాజపా కైవసం చేసుకోనుందని అంచనా వేయడంతో కాషాయ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది.

## డీపోర్టేషన్ ప్రక్రియ కొత్తదేమీ కాదు - జై శంకర్

**అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జై శంకర్ పేర్కొన్నారు.**



దిల్లీ: అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. తాజాగా అమెరికా 104 మంది భారతీయులను స్వదేశానికి పంపించడంపై ఈ మేరకు కేంద్రమంత్రి రాజ్యసభలో ప్రకటన చేశారు. వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. డీపోర్టేషన్ సమయంలో వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు.

"అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్నిదేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో 2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత" అని జైశంకర్ వివరించారు.

### వారిని బంధించలేదు..

"అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే ప్రక్రియను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. వలసదారులను ఎయిర్‌క్రాఫ్ట్‌లో తరలించే విధానాన్ని 2012 నుంచి అమలు చేస్తుండగా.. నిబంధనల ప్రకారం వారిని నిర్బంధిస్తారు. టాయిలెట్‌కు వెళ్లే సమయంలో అవసరమైతే వాటిని తొలగిస్తారు. సైనిక ఎయిర్‌క్రాఫ్ట్, చార్టర్డ్ విమానాలకూ ఇది వర్తిస్తుంది. ఇందులో ఎటువంటి మార్పు లేదు. అయితే, మహిళలు, చిన్నారులను నిర్బంధించలేదని ఐసీఈ అధికారులు మాకు సమాచారం ఇచ్చారు" అని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో వారికి అవసరమైన ఆహారం, అత్యవసర వైద్య సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు.

### విపక్షాల నిరసనలు..

భారతీయులను అమెరికా వెనక్కి పంపించిన విధానాన్ని లేవనెత్తిన విపక్షాలు పార్లమెంటులో నిరసనలు చేపట్టాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. అమెరికా ప్రభుత్వ యంత్రాంగంతో తీసుకుంటున్న దౌత్యచర్యల గురించి వివరించాలని కోరాయి. దీనిపై లోక్‌సభ స్పీకర్ స్పందిస్తూ.. ఈ అంశం విదేశాంగ మంత్రిత్వశాఖకు సంబంధించినదని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించిందన్నారు. ఇలా ఉభయసభలకు అంతరాయం కలుగుతోన్న క్రమంలోనే రాజ్యసభలో కేంద్ర మంత్రి దీనిపై ప్రకటన చేశారు.

## భారత వలసదారుల తరలింపు.. స్పందించిన అమెరికా

ఇమ్మిగ్రేషన్ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం తమ విధానమని అమెరికా వెల్లడించింది.



దిల్లీ: తమదేశంలో అక్రమంగా ఉంటున్న భారత వలసదారులను వెనక్కి పంపడంపై అమెరికా స్పందించింది. తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అత్యంత ఆవశ్యకమని, అది తమ విధానమని పేర్కొంది. ఆ విమాన ప్రయాణం గురించి ఇంతకుమించి ఏం చెప్పలేమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ దౌత్యకార్యాలయ ప్రతినిధి మాట్లాడారు.

భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. నిన్న మధ్యాహ్నం శ్రీ గురు రాందాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానం దిగింది. ఇందులో హరియాణా, గుజరాత్, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్.. తదితర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు.

ఈ తరలింపు వేళ వలసదారులతో అమానవీయంగా ప్రవర్తించారని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఈ తరుణంలో విదేశాంగమంత్రి జై శంకర్ పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని అన్నారు. "అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్నిదేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో 2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత" అని జైశంకర్ స్పష్టం చేశారు.

## ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగసభలు నిర్వహిస్తాం

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు.

"స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించాం. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నాం. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే దిల్లీ వెళ్తున్నాం. ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదు" అని అన్నారు.

## యూజీసీ నిబంధనలతో విద్యార్థులకు నష్టం : ఢిల్లీలో కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరూద్ధమన్నారు.

సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు. నిబంధనలను సవరించాలని మంత్రిని కోరామన్నారు. ఇలా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని చెప్పామన్నారు. అలాగే, జాతీయ రహదారి 365బీని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామన్నారు. ఇక పార్టీ పిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనన్నారు. అనర్హత వేటు పిటిషన్లపై న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

## తెలంగాణ పీఈ సెట్.. ఎడ్ సెట్ షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

జూన్ 11 నుంచి 14 వరకు తెలంగాణ పీఈ సెట్ పరీక్షలు జరగనున్నాయి.

ఎడ్‌సెట్ షెడ్యూల్ ఇదే..

తెలంగాణ ఎడ్‌సెట్ నోటిఫికేషన్‌ను కాకతీయ వర్సిటీ విడుదల చేసింది. మార్చి 10న ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 12 నుంచి మే 13 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వర్సిటీ ప్రకటనలో పేర్కొంది. జూన్ 1న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి.

## సుపారీ గ్యాంగ్‌తో హత్య.. మమత హత్య కేసులో వీడిన చిక్కుముడి

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత కరీంగనర్ జిల్లా కొండనపల్లి శివారులో శవమై కనిపించింది. తల్లితో పాటు ఉన్న నాలుగేళ్ల బాలుడు ధ్రువ కనిపించకుండా పోయాడు. స్థానికంగా ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో నిందితులు పరారైన కారు నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చివరికి చెన్నైలోని ఒక లాడ్జిలో బాలుడు క్షేమంగా ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి సంరక్షణలోకి తీసుకున్నారు. బాలుడిని అతని నానమ్మకు అప్పగించారు.

నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో లభించిన ఆధారాల ప్రకారం వివాహేతర సంబంధమే హత్యకు కారణమని నిర్ధరించారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. మమత.. భర్తతో విడిపోయి సింగరేణి ఉద్యోగి భాస్కర్‌తో కలిసి ఉంటుందని గుర్తించారు. మమతకు భారీగా డబ్బు ఇస్తున్నాడని భాస్కర్ కుటుంబం తీవ్ర ఆగ్రహంతో ఉండేది. ఈ క్రమంలోనే భాస్కర్ కుటుంబ సభ్యులు రూ. 5 లక్షలు సుపారీ ఇచ్చి మమతను హత్య చేయించినట్లు పోలీసులు తేల్చారు. భాస్కర్ సోదరి, ఆమె స్నేహితుడు రఘు, సుపారీ కిల్లర్ కల్యాణ్, భాస్కర్ తండ్రి, అక్క సమీప బంధువును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# బిజెపి బిసి అస్త్రం ఈటెల !

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు కొత్త సమీకరణాల వైపు పయనిస్తున్నాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో బి.ఆర్.ఎస్, కాంగ్రెస్, బిజెపి మూడు పార్టీలు పోటా పోటీ పడ్డాయి.బి.ఆర్.ఎస్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్, కాంగ్రెస్ ప్రస్తుత ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి లకు సమ స్కందుడు బిజెపి లో ఎవరని తెలంగాణ వ్యాప్తంగా చర్చ నడుస్తున్నది.బి.ఆర్.ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీల ముఖ్యమంత్రులిద్దరూ అగ్ర వర్ణాలకు చెందిన వారే కావడం తో బిజెపి బిసి నాయకునిపై దృష్టి పెట్టింది.బి.ఆర్.ఎస్ పార్టీ కల్వకుంట్ల నాయకత్వంలో ఉంది. కాంగ్రెస్ పార్టీకి బిసి నాయకుడు మహేష్ గౌడ్ సారథ్యం వహిస్తున్నారు.పార్టీ నాయకత్వం ఒక ఎత్తు అయితే పాలనా పగ్గాలు ఒక ఎత్తు.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిసి వర్గానికి చెందినప్పటికీ ముఖ్యమంత్రి పదవిని మాత్రమే జనం పరిగణనలోనికి తీసుకుంటారు.ఆ లెక్కన బిజెపి పార్టీ అధ్యక్ష బాధ్యతతో పాటు,ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిసి వర్గానికి చెందిన నాయకుడిని రంగంలోనికి దించాలని యోచిస్తున్నట్టు పరిశీలకుల అంచనా.పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉధృత ప్రచారంతో అధికారం అంచుల వరకూ వచ్చిన బిజెపి సీట్ల సాధనలో వెనక బడింది.

బి.ఆర్.ఎస్ ను వెనక్కు నెట్టి ఎవరు అధికారం సాధిస్తారో అని అందరూ ఉత్కంఠగా ఎదురు చూసారు.

బిజెపి లో కార్యకర్తల ప్రతినిధిగా ఎగిసిన, ఎదిగిన బండి సంజయ్ దూకుడుతో పార్టీలో ఒక ఊపు వచ్చింది.అటు స్తబ్దుగా మారిపోయి అచేతన స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డి వల్ల జవసత్వాలు సమకూరాయి.

కానీ తెలంగాణాలో మొదటి నుండి వామపక్ష పార్టీల ప్రభావం ఉన్నది. ఈ శక్తులు బిజెపి కి సహజ శత్రువులుగా ఉన్నాయి.తెలంగాణ సాధనలో లెఫ్ట్ పార్టీలు, వామపక్ష ప్రజాసంఘాలు,కార్మిక సంఘాలు,పత్రికా రంగ వ్యక్తులు, అర్బన్ నక్సల్స్ బి.ఆర్.ఎస్ తో కలిసి నడిచారు. అధికార సాధన వరకు లెఫ్ట్ శక్తులతో అంటకాగిన బి.ఆర్.ఎస్, అధికారంలోనికి వచ్చిన తర్వాత కేసీఆర్ వీరిని పద్ధతి ప్రకారం దూరం పెట్టాడు. లెఫ్ట్ పార్టీలు ఉద్యమాలకు తప్ప పాలనకు పనికి రావని కేసీఆర్ కు బాగా తెలుసు.కేసీఆర్ ను ఉపయోగించుకుని తెలంగాణాలో ప్రభావ స్థితికి ఎదగాలని వామపక్ష శక్తులు ఆశించి బంగపడ్డాయి.

ప్రజా క్షేత్రంలో ఎలాంటి ప్రభావం చూపలేక పోతున్న వామపక్ష శక్తులు గద్దర్ ను కేంద్ర బిందువుగా ఫోకస్ చెయ్యడం ప్రారంభించాయి. ప్రగతి భవన్ వద్ద గంటల కొద్దీ వెయిట్ చేసినా గద్దర్ కు ఇంటర్వ్యూ ఇవ్వని కేసీఆర్ వైఖరిని సాకుగా చూపి అలక వహించిన వామపక్షాలు బిఆర్ఎస్ తో కటీఫ్ చేసుకుని కాంగ్రెస్ వైపు చూడడం ప్రారంభించాయి.కేంద్రంలో కాంగ్రెస్ పంచన చేరి బిజెపిని మోడీని నిలువరించడానికి ఇస్లాం క్రైస్తవ, జాతీయ అంతర్జాతీయ శక్తులతో కలిసి కమ్యూనిస్టులు ప్రయత్నించారు.తెలంగాణలో అదే వ్యూహంలో భాగంగా కమ్యూనిస్టులు కాంగ్రెస్ వైపు వెళ్లారు.ఎలాగైనా బిజెపి ని ఆధికారంలోనికి రానివ్వమని సిపిఐ నాయకుడు కూనమనేని సాంబశివ రావు ఈ మిలాకత్ వ్యూహాన్ని అత్యుత్సాహంతో ప్రకటించాడు.

తెలంగాణలో కూడా ఈ సమీకరణను పసిగట్టిన బిజెపి కొంత ఉదాసీనంగా మారి వెనకడుగు వేసి రేవంత్ రెడ్డికి సైడ్ ఇచ్చిందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.పార్టీ నిర్మాణం బలహీనపడి, ఓట్లలో పాతాళానికి పడిపోయిన కమ్యూనిస్టులు ఏదో ఒక పార్టీ పంచన చేరిపోయి రోజులు వెళ్లదీసే స్థితికి చేరుకున్నారు.ఒక సారి తెలుగుదేశంతో, ఒకసారి బిఆర్ఎస్ తో, ఒకసారి కాంగ్రెస్ తో కలవడం తప్ప మార్గం లేని స్థితికి చేరుకున్న కమ్యూనిస్టులు అటో ఇటో ఎటో ఓ వైపు జట్టు కట్టడం తప్ప గత్యంతరం లేదన్నది జగమెరిగిన సత్యం.

ఈ పొత్తుల నుండి దూరం జరిగి బిజెపి ఒంటరి పోరుకు సిద్ధమైంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పరిగణించదగ్గ



స్థాయికి చేరింది.కార్యకర్తల పనితో,జన సమర్థనలో గణనీయమైన స్థితికి బిజెపి చేరిన్నప్పటికీ రాష్ట్ర అధికారం అందడం ఒకింత కష్టమేనని గ్రహించిన బిజెపి, రాష్ట్ర అధికారం కంటే కేంద్రంలో అధికారం ప్రధానమని బిజెపి తన వ్యూహం మార్చింది.కేసీఆర్ అహంకారం అణచాలని బిజెపి ఆత్మ సమర్పణ చేసుకొని కాంగ్రెస్ కు దారి వదిలింది.బొటాబొటి మెజారిటీతో రాష్ట్ర కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు కమ్యూనిస్టు శక్తులు బిఆర్ఎస్ ను వదలి,వందిమాగదుల పాత్రతో కాంగ్రెస్ సేవలో మునిగిపోయారు.ఎన్నికల బహిష్కరణ పిలుపుతో ప్రజలచే బహిష్కరించబడ్డ నక్సల్స్ తెలంగాణ డిమాండుకు సహకరించారు.తెలంగాణ సాధనకు బెల్లి లలిత కళా ప్రదర్శనతో తో శ్రీకారం చుట్టిన అజ్ఞాత నక్సల్స్ శక్తులు గద్దర్ ను ముందుంచాయి.

గద్దర్ తెలంగాణా సాధనకు తన గళం ను వినిపించాడు.కమ్యూనిస్టు శక్తులన్నీ గద్దర్ ను కేంద్ర బిందువు చేసి తెలంగాణలో రాజకీయ ప్రాభవం చాటడానికి నడుం కట్టాయి.కానీ, రాజకీయ ఎత్తుగడలు తెలియని అతివాద కమ్యూనిస్టులు మనుస్మృతి వ్యతిరేకత పేరుతో బిజెపి పై యుద్ధం ప్రకటించారు.మొన్న హైద్రాబాద్ లో జరిగిన గద్దర్ 77 వ జయంతి రోజు మాజీ నక్సలైట్ శ్రీ గాదె ఇన్నయ్య గారి ఉపన్యాసం ఈ విషయాన్ని స్పష్టం చేసింది బండి సంజయ్ ను విలేఖర్లు గద్దర్ కు పద్మశ్రీ ఎందుకు ఇవ్వలేదని అడిగితే జవాబుగా సంజయ్ మాట్లాడుతూ గద్దర్ కు పద్మశ్రీ ఎలా ఇస్తామని అన్నాడు. అతడొక నక్సలైట్ అని, హత్యలను ప్రోత్సహించిన హింసావాది గద్దర్ కు పద్మశ్రీ ఇచ్చే ప్రశ్నే లేదని సంజయ్ మాట్లాడగానే ఈ కమ్యూనిస్టు గ్రూపులన్నీ చెంగు చెంగున ఎగిరాయి.దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు బిజెపి ని అడ్డుకోవడమే రాజకీయ కార్యక్రమంగా మార్చుకున్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా 8 ఎంపీ సీట్లు సాధించడం తెలంగాణలో బిజెపి పని విధానానికి వ్యూహ చతురతకు నిదర్శనం.బిజెపి ఎదుగుదలను కమ్యూనిస్టులు అడ్డుకోలేరని స్పష్టం అయింది.కానీ ఎన్నికల గణాంకాల ఆటను ఆడడంలో బిజెపి ఆరితేరింది. గెలుపుకు ప్రతి ఓటు ముఖ్యమని బిజెపికి తెలుసు.కమ్యూనిస్టుల ఓట్లు కూడా ఆకర్షించే విధానాన్ని బిజెపి నేర్చుకున్నది.ప్రెస్ మీట్లలో కమ్యూనిస్టులు భయపెడితే బిజెపి బెదిరే స్థితిలో లేదు.అయితే ఎన్నికల్లో ప్రతి ఓటు ముఖ్యమే కాబట్టి వర్గాలుగా విభజించబడ్డ ప్రతి ఓటరు మద్దతు అవసరమని బిజెపికి తెలుసు.గతంలో నక్సలైట్ అయిన మంద కృష్ణ వ్యక్తిత్వాన్ని సరిగ్గా అంచనా వేసిన బిజెపి ఆ యోధున్ని పద్మ అవార్డ్ తో సత్కరించి గౌరవించింది.న్యాయమైన డిమాండ్ తో దాదాపు మూడున్నర దశాబ్దాలు అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ కు అండగా నిలవడం బిజెపి వ్యూహ చతురతకు నిదర్శనం. తెలంగాణలో బలమైన మాదిగ సామాజిక వర్గ నాయకునితో మమేకమవ్వడం బిజెపికి లాభించే అంశం.అదే విధంగా నక్సలైట్ భావజాలంతో విద్యార్థి ఉద్యమంలో పనిచేసి ఎదిగిన ఈటెల రాజేందర్ ను అక్కున చేర్చుకోవడం బిజెపి రాజకీయ బంధాల అల్లికలోని గొప్పదనం కనిపిస్తున్నది.తెలంగాణ ఉద్యమ పోరాటంలో ముందు వరసలో ఉండి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలతో, నాయకులతో, యోధులతో అనుబంధం కలిగిన ఈటెల ఎమ్మెల్యేగా మంత్రిగా అపార పాలనానుభవం గడించాడు.కమ్యూనిస్టు యోధునిగా, తెలంగాణ ఉద్యమ యోధుడిగా ఈటెల కు ఉన్న బయోడేటా అతడిని రాష్ట్ర నాయకుడుగా ముందు వరసలో నిలిపింది.బిఆర్ఎస్ లో ఈటెల కు ఎదురైన పరాభవంలో బిజెపి అతడికి తోడుగా నిలిచింది.అతని స్వాభిమానం కాపాడడంలో బిజెపి ఒక రక్షా కవచంగా మారింది.ఈటెల బిజెపి టికెట్ తో ఎమ్మెల్యేగా ఎంపీ గా గెలిచి రాజకీయ వేదికపై రాష్ట్రంలో ప్రజలకు ఒక భావి ముఖ్యమంత్రిగా కనిపిస్తున్నాడు.బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు రెండింటికీ అగ్ర వర్ణాల ముఖ్యమంత్రులు సారథ్యం వహిస్తున్నారు.దేశ ప్రధాని మోడీ ఓబీసీ వర్గానికి చెందిన



వాడు.మోడీ ప్రభావంతో బిజెపి వెలిగిపోతున్నది కాబట్టి కాంగ్రెస్ ఇప్పుడు కొత్తగా బిసి రాగం అందుకున్నది.ఎక్కడ పడితే అక్కడ బిసి జపం చేస్తున్న రాహుల్ గాంధీ తెలంగాణకు ఒక బిసి ని ముఖ్యమంత్రిని చేసి ఉంటే కాంగ్రెస్ కు తిరుగుండేది కాదు.కాంగ్రెస్ బిసి ఎత్తుగడను బిజెపి ఒక అవకాశంగా మలుచు కోవాలని వ్యూహం పన్నుతున్నది.తెలంగాణలో బిజెపి కి బిసి నాయకుల కొరత లేదు.

బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ అరవింద్ కూడా ఫైర్ బ్రాండ్ బిసి నాయకులే.తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారం అందుకోవడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకున్నది. బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుని రేస్ లో బండి సంజయ్,అరవింద్,మురళీధర్ రావ్, రఘునందన్ రావు ఈటెల రాజేందర్ ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.రాజా సింగ్ పేరు కూడా వినిపిస్తున్నది.పార్టీని గెలిపించే నాయకుడే ముఖ్యమంత్రిగా ఉండే అవకాశమున్నది.ఈ సీక్వెన్స్ లో నాయకుల మెరిట్స్ డిమెరిట్స్ అంచనా వేయడంలో బిజెపి కేంద్ర నాయకత్వం, రాష్ట్ర పార్టీ పరిశీలకులు, ఇన్చార్జి లు తలమునకలయ్యారు.బండి సంజయ్ ప్రతి కార్యకర్తతో కనెక్ట్ అయ్యాడు.ఒకసారి అధ్యక్షునిగా పనిచేసి మెప్పు పొంది ఇప్పుడు కేంద్ర మంత్రిగా భాధ్యత నేరవేరుస్తున్నాడు. అధ్యక్షుని భాధ్యత కంటే కీలక మంత్రి పదవితో దేశ అంతర్గత శాంతి భద్రత రక్షణ భాధ్యతతో రాటుదేలుతున్నాడు. సంజయ్ ఈసారి రాష్ట్ర అధ్యక్షుని భాధ్యత ఇష్టపడడం లేదని వినిపిస్తున్నది.ఇక నిజామాబాద్ ఎంపి అరవింద్ రాజకీయ ఎత్తుగడల్లో సమర్థుడని అనిపించుకున్నాడు. కానీ బిజెపి సంస్థాగత నిర్మాణంలో అలక్ష్యం వహిస్తున్నాడన్న పేరు తెచ్చుకున్నాడు.అరవింద్ తండ్రి డిఎస్ శ్రీనివాస్ గారు రెండు సార్లు సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా,మంత్రిగా విస్తృత అనుభవం కలవాడు. తన తండ్రి ద్వారా రాజకీయ ఎత్తుగడలు పునికి పుచ్చుకున్న అరవింద్ బిజెపి సంస్థాగత వ్యవహారాల్లో అతని వ్యవహార సరళి పట్ల రాష్ట్ర కేంద్ర పార్టీ నాయకత్వాలు సంతృప్తి కరంగా లేవన్న వార్తలు వినిపిస్తున్నాయి.బిసి బిడ్డ అయినప్పటికీ అరవింద్ సారథ్యం ఒకింత అనుమానాస్పదంగా ఉందన్న సమాచారం లోలోపల చక్కర్లు కొడుతున్నది.ఇక పోల్సాని మురళీధర్ రావు పార్టీ కొరకు త్యాగాలు చేసినవాడు. నక్సల్స్ కాల్పుల్లో గాయపడి బతికిన వాడు.ఢిల్లీలో పార్టీ జాతీయ భాధ్యతలు నిర్వహించిన అపార అనుభవం కలవాడు.కార్యకర్తల్లో గౌరవం గలవాడు.కానీ కేసీఆర్ సామాజిక వర్గానికి చెందిన వాడు కావడం ఒక అవరోధంగా మారింది. బిసి నాయకత్వ ఈక్వేషన్ లో మురళీధర్ గారి పేరు వెనుకబడి పోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి.

దక్షిణ భారత దేశం నుండి మురళీధర్ రావు గారిని బిజెపి జాతీయ అధ్యక్షునిగా పరిగణన లోకి తీసుకునే అవకాశముంది కాబట్టి బిసి కార్డు లక్కల్లో మురళీధర్ రావుకు రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు దక్కకపోవచ్చని అంచనా వినిపిస్తున్నది.ఇక ఇంకో ఎంపీ శ్రీ రఘునందన్ రావు తన వాక్చాతుర్యంతో ఒక స్పెషల్ ముద్ర వేసుకున్నాడు.కానీ అతనిది కూడా కేసీఆర్ సామాజిక వర్గం కావడం ఒక డిమెరిట్ అని భావిస్తున్నారు.రాజాసింగ్ సమర్థుడైన నాయకుడు. కరడు గట్టిన హిందూ గొంతుకగా ఎదిగాడు. కానీ భాష అతనికి అవరోధం.తెలుగులో ప్రభావ వంతంగా మాట్లాడలేని రాజసింగ్ సర్వ జనామోదం పొందడంలో ఇంకా పని చెయ్యాల్సి ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం.తెలంగాణలో అందరికీ ఆమోద యోగ్యుడైన ఒక బిసి నాయకునికి పార్టీ పగ్గాలుఅందించాలని కార్యకర్తలు కూడా భావిస్తున్నారు. రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీ నాయకత్వాలు కూడా ఇదే అభిప్రాయం సరైనదని భావిస్తున్నట్టు సమాచారం.బిసి కులాలన్నింటిలో ముదిరాజ్ ల జనాభా పెద్దది కావడం అధ్యక్ష ఎంపికలో ఈటెల కు కలిసి వచ్చే అంశం.ఇక ఈటెల ఒరిజినల్ బిజెపి బ్రీడ్ కాదని ఒక వాదన కూడా వినిపిస్తున్నది.ఈ వాదనకు కాలం చెల్లింది. పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ నుండి వచ్చిన సువేందు అధికారిని రాష్ట్ర అధ్యక్షుడిగా, శాసన సభ ఫ్లోర్ లీడర్ గా చేసింది బిజెపి.సంప్రదాయ బిజెపి పనితీరును కాదని గెలుపు వైపు నడిపించే నాయకులకు బిజెపి తగిన గుర్తింపు, నాయకత్వం అందిస్తున్నాడు.

అస్సాం హేమంత బిశ్వ శర్మ కూడా కాంగ్రెస్ నాయకుడే. అతడిని బిజెపి స్వాగతించి పార్టీ నాయకత్వం తో పాటు ముఖ్యమంత్రి పీఠం అప్పగించింది. హేమంత బిశ్వ శర్మ బిజెపి నమ్మకాన్ని నిలబెట్టి ఇప్పుడు అతను దేశంలో బిజెపి పార్టీ స్టార్ క్యాంపెనియర్ గా మారాడు.ఇక తమిళనాడులో పూర్తిగా కొత్తవాడు రాజకీయ అనుభవం లేని అన్నామలైకి రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించింది బిజెపి.ఆ నమ్మకాన్ని నిజం చేస్తున్నాడు అన్నామలై.

కర్నాటకలో కాంగ్రెస్ నాయకుడు బొమ్మై ని పార్టీలో చేర్చుకుని ముఖ్యమంత్రిగా చేసింది బిజెపి.పార్టీని నడిపే మెలుకువలు,సామర్థ్యం ఉన్న నాయకుణ్ణి బిజెపి తప్పకుండా స్వాగతిస్తుందని రుజువైంది.ఇది చారిత్రక అనివార్య పరిణామం.అందరినీ కలుపుకు పోవడంలో బిజెపి తన విశాలత్వాన్ని చాటుకుంటున్నది.తెలంగాణలో మిగిలిన వ్యక్తి ఈటెల రాజేందర్ గారు.ఈటెల లెఫ్ట్ రైట్ పార్టీల పని తీరు తెలిసినవాడు.అధికార రాజకీయాలు నేర్చుకున్నవాడు.బిజెపి సంస్థాగత నిర్మాణాన్ని గౌరవిస్తూ కార్యకర్తలతో కలిసి పోవడంలో అందరి మెప్పు పొందుతున్నాడు.సౌమ్యంగా కనిపిస్తూనే ఉగ్ర అవతారం ఎత్తగలడని ఈటెల గురించి తెలిసిన వారు అంటుంటారు.రాజకీయ ఆటలో బిజెపిని అధికార తీరం చేర్చడంలో ఈటెల సామరస్య వ్యవహార సరళి బాగా ఉపయోగపడుతుందని బిజెపి పార్టీ నాయకత్వం గ్రహించిందని విశ్వసనీయంగా తెలుస్తున్నది.కమ్యూనిస్టు విప్లవ శక్తుల్లో,దళిత సామాజిక వర్గాల్లో ఈటెల పట్ల సానుకూల అభిప్రాయం ఉండడం కలిసి వచ్చే అంశం.తెలంగాణలో ఎలాగైనా అధికారం సాధించాలన్నదే బిజెపి పార్టీ లక్ష్యం.ఆ లక్ష్య సాధనలో కులాల, అన్ని సామాజిక వర్గాల కూర్పును జాగ్రత్తగా అల్లుకుంటూ పాత కార్యకర్తలకు అర్థం చేయిస్తూ, కొత్త వారిని కలుపుకుంటూ బిజెపి తన రాజకీయ వ్యూహాలతో ఎత్తుగడలతో ముందుకెళ్తున్నది.అధికార సాధనకు బిజెపి బిసి తురుపు ముక్క ఈటెల అని వినిపిస్తున్నది.ఈ అంచనాలు అభిప్రాయాలు ఏమిటో ? బిజెపి కొద్ది రోజుల్లో బయట పెట్టే అవకాశముంది.

# రాజకీయుని రౌడీయిజం

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

మేడ్చల్ మండలంలోని కోనాయిపల్లి గ్రామంలో హెచ్,ఎం.డి.ఏ మరియు రెరా అనుమతులతో చట్టబద్ధంగా పనులు చేస్తున్న ఒక లే ఔట్ వెంచర్ లోనికి ప్రవేశించిన ఒక నాయకుడు అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని దుర్భాషలాడుతూ బెదిరించాడని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగి భాను చందర్ ను చంపుతా, మీకు చుక్కలు చూపిస్తా అని బెదిరించాడని మరో ఉద్యోగి శ్రీనాథ్ కరపత్రం తో చెప్పాడు. అతని పేరు అడిగినా చెప్పలేదని అన్నాడు.కోనాయిపల్లి గ్రామానికి చెందిన గుంటి రమేష్ అనే వ్యక్తి గతంలో ఇలా చాలాసార్లు పనులకు ఇబ్బంది కలిగిస్తే వెంచర్ వేస్తున్న డెవలపర్లు అతనిపై మేడ్చల్ లోని ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ.యస్ నంబర్ 244/2024 తో కేసు వేసారని శ్రీనాథ్ చెప్పాడు.ఈ కేసులో తేదీ 7 నవంబర్ 2024 రోజున పర్ పెచ్యువల్ ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిందని అన్నారు.ఆ ఆర్డర్ ప్రకారం రమేష్ ఇట్టి స్థలం లోనికి ప్రవేశించ కూడదని కోర్టు ఆర్డర్ ఇచ్చిందని శ్రీనాథ్ అన్నారు.అదే విధంగా తనపై ఈ రమేష్ అనే వ్యక్తి భౌతికంగా



దాడి చేసి రక్తం వచ్చేలా గాయపరిచాడని శ్రీనాథ్ చెప్పాడు.అతనిపై మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో కంప్లయింట్ చేసానని, తేదీ 15 ఏప్రిల్ 2024 రోజున 349/2024 నంబర్ తో మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ సెక్షన్లతో అతనిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు అయిందని శ్రీనాథ్ చెప్పాడు.ఈ నేర స్వభావం గల రమేష్ అని వ్యక్తి ఈ స్థలంలోనికి ప్రవేశించకూడదని కోర్టు ఆర్డర్ ఉన్నా, అతనిపై క్రిమినల్ కేసు ఉన్నా అతనిని వెంటబెట్టుకుని ఇట్టి స్థలంపైకి వచ్చిన నాయకుడు కూడా కోర్టు ధిక్కరణ చేశాడని, ఇది నేరాన్ని నేరస్తుడిని ప్రోత్సహించే చట్ట వ్యతిరేక చర్య అని శ్రీనాథ్ అన్నాడు.ఇతని అక్రమ ఫిర్యాదుతో రమేష్ ను, వెంచర్ యజమానులను పిలిచి మేడ్చల్ తహసీల్దార్ సమగ్ర విచారణ చేసారని శ్రీనాథ్ చెప్పాడు.అక్రమ, అకారణ కంప్లైంట్ లతో అధికారుల సమయాన్ని దెబ్బతీసి, విధులకు ఆటంకం కలిగిస్తే పోలీస్ కేసుతో అరెస్టు చేయిస్తానని తహసీల్దార్ రమేష్ ను బెదిరించారని శ్రీనాథ్ అన్నాడు.ఈ రమేష్ అనే వ్యక్తి కోనాయిపల్లి గ్రామంలో అందరితో గొడవలు పడే వ్యక్తి అని, ఇతడు ఒక కయ్యాల మారి అని శ్రీనాథ్ అన్నాడు.మా వెంచర్ లోనికి అక్రమంగా ప్రవేశిస్తూ మాటిమాటికీ చిన్నా పెద్దా నాయకులతో పోలీసులకు ఫోన్లు చేయించి పోలీసులను విసిగించాడని అన్నాడు.ఇతని నేర స్వభావం అర్థం చేసుకున్న పోలీసులు ఇంకొక సారి ఈ విషయంలో పోలీస్ స్టేషన్ మెట్లు తొక్కితే న్యూసెన్స్ కేసు లో అరెస్టు చెయ్యాల్సి ఉంటుందని సి.ఐ గారు రమేష్ ను బెదిరించాడు.సివిల్ స్వభావం గల ఈ విషయాన్ని క్రిమినల్ నేచర్ లోనికి మార్చి అక్రమ లాభం పొందడానికి ఈ రమేష్ అని వ్యక్తి చాలా సార్లు ప్రయత్నించాడు.గ్రామ కట్టుబాట్లకు,పెద్ద మనుషుల ఒప్పందాలకు వ్యతిరేకంగా దుర్వ్యవహారం తో ఇప్పటికే ఎందరో నాయకులను తప్పుడు సమాచారంతో ఈ విషయంలో తలదూర్చేలా చేశాడని శ్రీనాథ్ అన్నాడు.ఇప్పుడు కొత్తగా, ఇంకొక కొత్త నాయకునితో రమేష్ కొత్త ప్రయోగం చేశాడని శ్రీనాథ్ అన్నాడు.ఏదో పార్టీ పేరు చెప్పి, ఎవరో నాయకులు ఇలాంటి వ్యక్తులను ప్రోత్సహిస్తే శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని శ్రీనాథ్ అన్నాడు.ఈ విషయం తెలుసుకుని కోనాయిపల్లి గ్రామస్తులు గడ్డం నవీన్, దీపక్, నర్సింగ్, కిరణ్, సుధాకర్,శేకర్ తదితరులు ఈ బెదిరింపులను ఖండించారు.విషయం తెలియకుండా చట్ట వ్యతిరేక, సంఘ వ్యతిరేక శక్తులకు ఎవ్వరూ సహకరించకూడని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రజా సంక్షేమానికి అలుపెరుగని కృషి చేస్తున్నాడని,శాంతి భద్రతల రక్షణతో ప్రజలకు ప్రశాంత జీవనాన్ని అందిస్తున్నాడని అన్నారు.ఇలా కొందరు ఊరూ పేరూ లేని స్థానిక నాయకులు ముఖ్యమంత్రి బాటలో నడిచి ప్రశాంత తెలంగాణ స్థాపనకు కృషి చేయాలని, ఇలా పాత కాలపు రౌడీ రాజకీయంతో సామాజిక అశాంతిని సృష్టించే వారిపై అధికారులు, నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని కోనాయిపల్లి గ్రామస్తులు అన్నారు.

# మాటకు కట్టుబడటం కాంగ్రెస్ కే సాధ్యం..

**- వర్గీకరణను సాకారం చేసిన సీఎం..**
**- రేవంత్ సహా అమాత్యులకు అభినందనలు.**
**- వర్గీకరణతో నెరవేరిన మాదిగల కల..**
**- ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ...**







**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 6**
ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణను కాంగ్రెస్ పార్టీ తీసుకు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాశాఖ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కాంగ్రెస్ ప్రజా పాలన ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ పట్టణములోని అంబేద్కర్ చౌరస్తా నుండి జగ్జీవన్ రామ్ చౌరస్తా వరకు నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తోపాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, జిల్లా నగర కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి అరుణ్, లింగంపల్లి బాబు తదితరులు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా వచ్చి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చింది, తెలంగాణ రాష్టం ఇచ్చిందీ కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. అంతే కాకుండా తాజా కాంగ్రెస్ వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యపడిందన్నారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు ఎదురు చూస్తున్న వర్గీకరణ కలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేయగలిగిందన్నారు. ఏళ్ల నాటి వర్గీకరణ పోరాటానికి తెరదించుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అన్నిపక్షాలు మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న వర్గీకరణ పోరాటంలో ఎంతోమంది అసువులు బాసారని, వర్గీకరణ వల్ల ఎవరి వాటా ఎంతో తేల్చుతామని చేవెళ్ల ఎన్నికల మేనిఫెస్టోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున కర్గే లు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు కవ్వంపల్లి ధన్యవాదాలు తెలిపారు.

**వర్గీకరణకు కాషాయ రంగు పులమొద్దు...**
వర్గీకరణకు మందకృష్ణ మాదిగ కాషాయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే ఆయన కాషాయం పార్టీ వైపు అడుగులేయడం కొంత ఆందోళన కలగించిందని, అయితే ఈ క్రమంలోనే వర్గీకరణకు ఇరు సభల ఆమోదం పొందాయన్నారు. 1994 నుంచి మాదిగల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాన్ని గుర్తించడమే కాకుండా గౌరవిస్తామని, ఆయన పోరాటాలకు కవ్వంపల్లి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల జనాభా దామాషా ప్రకారం 11 శాతం వరకు రిజర్వేషన్ కొంతమంది కోరుతున్నారని, 2026 లో జనాభా లెక్కల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఆమోదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సబ్ కమిటీలో సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులతోపాటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు, యావత్ దళిత జాతిపక్షాన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

**మాట తప్పిన బీ ఆర్ ఎస్...**
దళితుడిని జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పిన పార్టీ బి ఆర్ ఎస్ అని ఆయన విమర్శించారు. 30 ఏళ్ల పోరాటం తర్వాత మాదిగల మాదిగ ఉపకులాల పోరాటం ఫలించిందని, ఇక అన్ని దళిత జెండాలు కాంగ్రెస్ పార్టీ గొడుగు కిందనే పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, కల్వల రామచందర్, సముద్రాల అజయ్, జీడి రమేష్, పోతారపు సురేందర్, దీకొండ శేఖర్ ,హస్తపురం రమేష్, మారంపల్లి లక్ష్మీనారాయణ, గాలి అనిల్ కుమార్, హస్త పురం తిరుమల ,కాంపల్లి కీర్తి కుమార్, అహమ్మద్ అలీ ,గజ్జల ఆనంద్, కుర్ర పోచయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ,పులి ఆంజనేయులు గౌడ్ ,విక్టర్, రాచకొండ ప్రభాకర్ ,సలీముద్దీన్, పులి కృష్ణ, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, సిరిపురం నాగప్రసాద్ ,షబానా మహమ్మద్, హనీఫ్, జ్యోతి రెడ్డి, పెద్ది గారి తిరుపతి ,బోనాల మురళి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దానంతో.. మరొకరికి జీవితం..

**- సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్..**





**కరపత్రం ప్రతినిధి, వీణవంక, ఫిబ్రవరి 5.**
నేత్రదాత అయిత సత్యనారాయణ సంస్మరణ సభను వారి నివాసం వీణవంక నందు సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు యం.నరహరి ఆధ్వర్యంలో నిర్వహించగా, అతిథులుగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి పాల్గొని, వచ్చిన బంధు మిత్రులకు నేత్ర అవయవ శరీర దానాలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే నేత్రదాత కుమారుడు కోడలు. అయిత శివశంకర్, రజిత. కూతురు అల్లుడు బెజగం ప్రగతి, మధు ల కు సదాశయ ఫౌండేషన్ జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జమ్మికుంట కన్వీనర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు ( డీలర్)వీణ వంక డీలర్ శ్రీధర్, ఓదెల కార్యదర్శి క్యాతం మల్లేశం పాల్గొని నేత్రదాతకు నివాళులు అర్పించి కుటుంబానికి అభినందనలు తెలిపారు. ఇదే వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ శరీర నేత్ర దానాలపై అవగాహన సదస్సును ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ దానాల అవశ్యకతను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు యం.నరహరి, ఓదెల కార్యదర్శి క్యాతం మల్లేశం వివరించారు. చివరగా రాంమోహన్ మాట్లాడుతూ... అవయవ శరీర దానాలపై ఎంతో విలువైన సమాచారం విద్యార్థులకు అందజేసిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్స్ పాల్గొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా పట్టుభద్రుల కాంగ్రెస్ పార్టీ ఏమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా.పనిచేస్తాం

**.కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 6....**
కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో.. బుధవారం రోజున కరీంనగర్ ఇ.ఎన్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసినటువంటి ఆత్మీయ సమ్మేళనం లో, ఏమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి





**అడుగడుగునా ఘన స్వాగతం పలికిన యువజన కాంగ్రెస్ నాయకులు...**

ఈ సందర్బంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూబీ విద్యావంతుడు ఉపాధ్యాయుడు ఎన్నో విద్యా సంస్థలు ఏర్పాటు చేసి ఎంతో మందికి గొప్ప భవిష్యత్తును మంచి విద్యను అందిస్తూ, ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన వ్యక్తి, ఏమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి గెలుపును యువజన కాంగ్రెస్ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని యువజన కాంగ్రెస్ నాయకులంతా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ఏమ్మెల్సీ ఎన్నిక యువజన కాంగ్రెస్ భుజాల వేసుకొని అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బహుమతిగా ఇవ్వాలని జక్కిడి శివచరణ్ రెడ్డి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శి వోల్లాల రవి తదితరులు పాల్గొన్నారు.

# చిరుతల రామాయణం మాస్టారు ఆకస్మిక మృతి- పలువురి సంతాపం.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 6.**
హుజురాబాద్: గత పాతికేళ్ల క్రితం చిరుతల రామాయణం అంటే గ్రామీణ ప్రాంతాలలో ఎంతో క్రేజీ ఉండేది. అలాంటి చిరుతల రామాయణం గ్రామీణ ప్రజలకు అలవోకగా నేర్పి ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీపాద చంద్రయ్య చిరుతల రామాయణం గురువు గుండెపోటుతో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. ఆ విషయం తెలియగానే చిరుతల రామాయణం నేర్చుకున్న అతనికి శిష్యులు అతని అభిమానులు ఆయన అంత్యక్రియలో పాల్గొనడం కాక ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. చంద్రయ్య చిరుతల రామాయణాన్ని కళ్ళకు కట్టినట్టుగా నాటి రామాయణాన్ని ప్రజలకు ప్రదర్శించి భక్తి పారవశ్యంలో మునిగి పోయేలా చేసేవారు అనడంలో అతిశయోక్తి లేదు. ఆయన పౌరాణిక నాటక కళారంగాన్ని అతని వారసత్వంగా పెద్ద కుమారుడైన రమేష్ కలలను నేర్చుకున్నాడు. అంతేగాక డోలక్ వాయించడంలో ఎంతో నేర్పరి. ఆయన అనేకచోట్ల భజన పోటీలకు వెళ్లి తన డెవలప్ విన్యాసాన్ని




ప్రదర్శించి జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకున్నారు. రమేష్ తండ్రి చంద్రయ్య మృతి చెందడన్న విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మేకల తిరుపతి, బిజెపి సీనియర్ నాయకుడు మోతి తిరుపతి, సీనియర్ జర్నలిస్టు మండల యాదగిరి, ఆ గ్రామం మాజీ సర్పంచ్ లు, వివిధ పార్టీల నాయకులు, సీనియర్ కళాకారులు, జర్నలిస్టులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

# శ్రీ భగవద్గీత జ్ఞాన మందిరం 36వ వార్షికోత్సవం..,





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఫిబ్రవరి 6....**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని శ్రీ భగవద్గీత జ్ఞాన మందిరం 36వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం రోజున శ్రీ సుదర్శన నరసింహా హవనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సుదర్శన నరసింహావన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మరిగంటి సంతోషాచారి మరియు వేద పండితులు నిఖిల్ ఆచారి, రఘునందన్ ఆచారి, వెంకటాచార్యులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా హోవన కార్యక్రమం నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఏజీబీవీ పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 6...**



గురువారము రోజున జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీయుటకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని , అనంతరం మంచి ప్రతిభ కనబరిచిన మొదటి నలుగురు విద్యార్థులకు బహుమతులను స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) బహుమతులు అందజేశారు. బహుమతులు వి కీర్తన, ఈ శ్వేత బిందు, బి హనీ, ఎం అలేఖ్య లకు శంకర్ నారాయణ డిక్షనరీలు మరియు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినీలు అందరూ పాల్గొన్నారు.

# ఆముదాలపల్లి లో వ్యవసాయ శాఖ అధికారులు డిజిటల్ సర్వే...

**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఏ డి ఏ శ్రీధర్...**

**కరపత్రం శంకరపట్నం ఫిబ్రవరి 6**



వ్యవసాయ శాఖ అధికారులు డిజిటల్ ట్రాప్ సర్వే నిర్వహించినట్లు మానకొండూర్ ఏ డి ఏ శ్రీధర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏడిఏ శ్రీధర్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం ఆముదాల పల్లి గ్రామంలో క్షేత్రస్థాయిలో డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించి, పలు సూచనలు చేసినట్లు ఏదిఏ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, ఏఈఓ సునంద తదితరులు పాల్గొన్నారు.